
సాక్షి గుంటూరు

శనివారం । 21 । సెప్టెంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 28,807 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 33,640 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 7713 క్యూసెక్కులు వదలగా బ్యాంక్ కెనాల్‌కు 1861 క్యూసెక్కులు వదిలారు.



49,041 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,733 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 49,041 బస్తాలు అమ్మారు.

కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల ఆందోళన



తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని గుంటూరు జీజీహెచ్ ఆవరణలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు శుక్రవారం కూడా ఆందోళన నిర్వహించారు.

- వివరాలు 8లో▸

మందు బాబుల ఆరోగ్యంతో చెలగాటం



తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అంటూ బీరాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం.. ప్రత్తిపాడులో కాలం చెల్లిన బీర్లను మద్యం ప్రియులకు అంటగట్టింది.

- వివరాలు 8లో▸

పెదవడ్లపూడిలో నకిలీ క్లినిక్ మూసివేత



పెదవడ్లపూడిలోని విజయ క్లినిక్‌లో అర్హతలు లేని వ్యక్తి వైద్యం చేస్తుండటంతో డీఎంహెచ్‌వో ఆదేశాలతో క్లినిక్‌ను సీజ్ చేశారు.

- వివరాలు 8లో▸

వెంటనే జీవో నెం. 85 రద్దు చేయాలి



పీజీ చదువుకోవాలనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల కోరికను హరించి వేస్తున్న జీవో నెం. 85ను రద్దు చేయాలని గుంటూరులో శుక్రవారం ఆందోళన జరిగింది.

- వివరాలు 8లో▸

ఖరీఫ్.. ఉఫ్..!

అన్నదాతల ఆశలను ఊడ్చేసిన వానలు.. దెబ్బతీసిన కూటమి సర్కారు చేతలు



ఇటీవలి భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు

67.7 శాతం మేరకే సాగైన పంటలు

- సీజన్ ముగింపునకు కొన్ని రోజులే గడువు
- డెల్టాకు నీరు వచ్చినా ఊపందుకోని వరి
- ప్రకృతి కన్నెర్రతో భారీగా రైతులకు నష్టం

ప్రకృతి కన్నెర్ర చేయడంతో భారీ వర్షాలకు రైతులు కుదేలయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ సంవత్సరం 67.7 శాతమే పంటలు సాగయ్యాయి. సీజన్‌కు కొన్ని రోజులు గడువున్నా విస్తీర్ణం పెరిగే అవకాశాలు అంతంత మాత్రమే కనిపిస్తున్నాయి. కూటమి సర్కారు పెట్టుబడి సాయంలో చేతులెత్తేయడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. వానకు నష్టపోయినా ఆదుకోలేదు. మళ్లీ పంట సాగుకు చేతిలో చిల్లిగవ్వ లేక అన్నదాతలు దీనావస్థకు చేరారు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు, కొరిటెపాడు : ఎన్నో ఆశలతో ఖరీఫ్ సాగును ఆరంభించిన అన్నదాతలకు ఈ ఏడాది నిరాశే మిగలనుంది. సీజన్ ముగింపునకు 10 రోజులు మాత్రమే గడువు ఉంది. సీజన్ ప్రారంభమై 110 రోజులు కావస్తున్నా జిల్లాలో 67.7 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. సీజన్ ఆరంభంలో వర్షాలు కురవడంతో పంటలు వేసినా.. జూలైలో అధిక వర్షాలకు సుమారు 12 వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి సంవత్సరం రైతు భరోసా పథకం కింద సీజన్ ప్రారంభానికి ముందే రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం వేసింది. కూటమి ప్రభుత్వం ఈ మొత్తం అందించకపోగా.. పంట నష్టపోయిన వారికి పరిహారం కూడా ఇవ్వలేదు. సబ్సిడీ విత్తనాలతోనే సరిపెట్టింది. దీంతో

▸ మిగతా 8లో..

బండలాగుడు పోటీల్లో అపశ్రుతి

- బెదిరి జనంపైకి దూసుకొచ్చిన గిత్తలు
- ఐదుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు



ఆస్పత్రిలో కటారి వెంకటేశ్వరరావు



వెంకట్రావు కాలికి అయిన గాయం



క్షతగాత్రులను 108లో గుంటూరుకు తరలిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: ఎడ్ల బండలాగుడు పోటీలు చూడటానికి వచ్చిన వారిలో అనుకోని రీతిలో గిత్తలు బెదరడంతో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో జరుగుతున్న నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వరరావు మెమోరియల్ ఎడ్ల బండలాగుడు పోటీల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. బరిలో ఉన్న గిత్తలు బెదిరి జనం మీదకు దూసుకురావడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోటీల్లో భాగంగా శుక్రవారం బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన ఎ.శిరీష చౌదరి ఎడ్లు బెదిరిపోయి జనం మీదకు దూకాయి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోటేశ్వరరావు

సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన ఎస్.వీరయ్య, పొన్నూరు మండలం గోళ్లమూడిపాడుకు చెందిన కటారి వెంకటేశ్వరరావు, పర్చూరు మండలం పోలూరుకు చెందిన నెలకుదురు వెంకట్రావు, ప్రత్తిపాడు మండలం మేడావారిపాలెం గ్రామానికి చెందిన టి.కోటేశ్వరరావులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియలేదు. రక్తపు వాంతులు చేసుకున్న వీరయ్యను 108లో గుంటూరుకు తరలించారు. మిగిలిన ముగ్గురిని మరో 108 వాహనంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించి, అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. వెంకటేశ్వరరావుకు కళ్లకు సమీపంలో, తలపై రక్తగాయాలయ్యాయి. వెంకట్రావుకు మోకాలి కింద తీవ్ర గాయమైంది.

న్యూస్‌రీల్

నర్సుపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు

నగరంపాలెం: నర్సుపై సామూహిక అత్యాచారం జరిపిన కేసులో ఓ నిందితుడికి ఇరవై ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె.నీలిమ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన యువతి మంగళగిరి రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహించేది. మేడికొండూరు మండలం మందపాడు గ్రామానికి చెందిన యువకుడు, ఆమె ప్రేమించుకున్నారు. విధులు ముగిశాక ఆమె అతడి బైకుపై ఇంటికి వెళ్లేది. ఈ క్రమంలో 2018లో ఓ రోజు రాత్రి విధులు ముగించుకుని ఇదేవిధంగా ఇంటికి బయలుదేరారు. ఆత్మకూరు కాల్వ కట్ట దాటాక కారులో వచ్చిన ఇద్దరు ఆ యువకుడిని బెదిరించి, నర్సుపై అత్యాచారానికి పాల్పడ్డారు. మంగళగిరి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయగా, ఏ2 మంగళగిరి రూరల్ ఆత్మకూరు గ్రామం యనాదికాలనీకి చెందిన వై.శ్రీనివాస్‌కు ఇరవై ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అప్పటి మంగళగిరి రూరల్ పీఎస్ సీఐ ఎం.సుబ్బారావు కేసు దర్యాప్తు చేయగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లపు కృష్ణ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పేదల అభివృద్ధి కోసమే సంక్షేమ పథకాలు



గుంటూరు వెస్ట్ : పేద ప్రజల అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక అంకమ్మ నగర్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గడచిన 100 రోజుల్లో ప్రభుత్వం ప్రజల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేసిందని చెప్పారు. పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, అన్న క్యాంటీన్లు వంటివి ఇందులో ఉన్నాయని తెలిపారు. స్థానికులతో సంక్షేమ పథకాల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో జీఎంసీ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, శివన్నారాయణ, పశ్చిమ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు వీఐటీ - ఏపీ 4వ స్నాతకోత్సవం

తాడికొండ: ఐనవోలులోని వీఐటీ- ఏపీ యూనివర్సిటీలో 4వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, గౌరవ అతిథిగా హైదరాబాద్‌కు చెందిన బోష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ సెంటర్ హెడ్ అంజాద్‌ఖాన్ పఠాన్ పాల్గొంటారని పేర్కొంది.

సీఆర్డీఏ గ్రీవెన్స్ డేకు స్పందన



తాడికొండ: తుళ్ళూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు మంచి స్పందన లభించింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తమ సమస్యలు విన్నవించుకున్నారు. అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అమరావతి రాజధానిలో నిర్మాణ పనులు ప్రారంభమైనందున 29 గ్రామాల్లో ఉన్న రైతులు, రైతు కూలీలు ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ డేను ఉపయోగించుకోవాలని ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వృద్ధుల సమస్యలను సత్వరం పరిష్కరించండి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: జిల్లాలోని వయోవృద్ధుల సమస్యల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జిల్లా స్థాయి డిజేబిలిటీ, సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ చట్టం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని చెప్పారు. జిల్లాలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాలను తరచూ తనిఖీ చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీనియర్ సిటిజన్స్‌కు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల వసతి గృహాల్లో ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులను చేర్చాలని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలు త్వరగా అందజేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, సీహెచ్ పరమేశ్వరరెడ్డి, యూవీవీ రత్నసాగర్ పాల్గొన్నారు.

'వందేళ్ల' వేడుక.. నిండైన కలయిక



అరుంధతీదేవితో కుటుంబసభ్యులు

వందేళ్ల తమ తల్లి పుట్టిన రోజు వేడుకను వారసులు ఘనంగా నిర్వహించారు. అందరి కుటుంబాల సభ్యులందరూ కలిసిన ఆ సమయంలో ఎంతో ఆనందంగా గడిపారు. ఈ అరుదైన కార్యక్రమం గుంటూరులో శుక్రవారం జరిగింది. ముప్పాళ్ల అరుంధతీదేవి శత జన్మదినోత్సవాన్ని బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితిలో కుటుంబసభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. గుంటూరు నగరానికి చెందిన దొంతరాజు శ్రీరాములు, మీనాక్షమ్మ దంపతుల కుమారుడైన మనోహరరావు సతీమణి అరుంధతీదేవి. కుమారులు, కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను సత్కరించుకుని, పాదాభివందనం చేశారు. వేడుకలో పాల్గొన్న హైకోర్టు న్యాయవాది కవిపురపు పట్టాభిరాముడు మాట్లాడుతూ.. విద్యావంతురాలైన అరుంధతీదేవి పెద్ద బాలశిక్ష కంఠస్థం చేయడంతోపాటు రామాయణ, భారత, భాగవతం వంటి పురాణ గ్రంథాలను వల్లె వేశారని అన్నారు. గాంధీ పిలుపు మేరకు స్వరాజ్య సంగ్రామంలో ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ, వావిలాల గోపాలకృష్ణయ్య వంటి సమరయోధులతో కలిసి పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో అరుంధతీదేవి వారసులు గోపాలకృష్ణమూర్తి, రామారావు, శివప్రసాద్, ప్రభాకరరావు, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, కవిపురపు రుక్మిణీదేవి, ఆంజనేయులు, చింతపల్లి శకుంతల, శంకర్ ప్రసాద్ పాల్గొన్నారు. – గుంటూరు ఎడ్యుకేషన్

'కాణి'స్టేబుళ్ల నిర్వాకంపై దర్యాప్తు?

ఎస్పీ ఆదేశాలతో రహస్యంగా వివరాల సేకరణ

- ఇప్పటికే సిండికేట్ సమాలోచనలు
- బాధ్యులపై చర్యలకు రంగం సిద్ధం

సాక్షి ఎఫెక్ట్

పట్నంబజారు: కోర్టు కానిస్టేబుళ్ల వ్యవహార శైలిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారని తెలుస్తోంది. శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'కాణి'స్టేబుళ్లు..! అనే కథనంపై అధికారులు స్పందించినట్లు సమాచారం. దీనిపై విచారణ చేపట్టాలని ఒక ప్రత్యేక విభాగ అధికారులకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ద్విచక్ర వాహనాన్ని ఐదేళ్లు నిబంధనలకు విరుద్ధంగా వినియోగించుకున్న అంశంలో బాధితుడి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న కోర్టు కానిస్టేబుల్ మాత్రం కొంతమంది అధికారుల ద్వారా బయటపడేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. మరోవైపు నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో ఆ బైకును స్వాధీనం చేసుకున్నప్పుడు అక్కడి అధికారి, కోర్టు కానిస్టేబుల్ ఎవరనే అంశంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. కోర్టులో ఏ కోర్టు అధికారికి గిఫ్ట్‌గా వాహనాన్ని ఇచ్చారనే కోణంలో కూపీ లాగుతున్నారు. ఇదే కానిస్టేబుల్ గతంలో ఒక దాడిలో పట్టుకున్న నాటు కోళ్లను కూడా విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. బాధితుడికి అప్పజెప్పాల్సిన వాహనాన్ని పోలీసులే ఇలా వాడుకున్న పరిస్థితుల్లో ఇలాంటివి ఇంకా ఎన్ని ఉన్నాయో.. అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాటి కానిస్టేబుల్‌నే రూ. 5 లక్షలు డిమాండ్ చేసిన కానిస్టేబుల్ విషయంపైనా ప్రత్యేక విభాగం అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం. ఈ అంశాల్లో కోర్టులో పనిచేసే కొంత మందికి భాగస్వామ్యం ఉండటంతో వారి పరిస్థితి ఏంటనేది చర్చనీయాంశంగా మారింది. జిల్లా కోర్టులో అందరు కానిస్టేబుళ్లు సిండికేట్‌గా ప్రతి నిర్ణయం తీసుకుంటారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం ఆరోపణలపై ఎలా వ్యవహరించాలనే సమాలోచనలు చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఏళ్ల తరబడి వారు కోర్టును పట్టుకుని వేలాడుతున్నారు. బదిలీ సమయంలో స్టేషన్లు మారినా తిరిగి కోర్టు విధులకే రావడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా శాఖను ప్రక్షాళన చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్.. ఇలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది.

పురుగుల మందు తాగి ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మహిళ మృతి.. అపస్మారక స్థితిలో మరో వ్యక్తి



మహిళ మృతదేహం



అపస్మారక స్థితిలో వ్యక్తి

చేబ్రోలు: పురుగుల మందు తాగి ఇరువురు గుర్తుతెలియని వారు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరిలో మహిళ మృతి చెందగా.. మరో వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులోని పెట్రోలు బంకు సమీప పొలంలోని వేప చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి, మహిళ శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగారు. మహిళ అక్కడికక్కడే మరణించింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడు. పొలానికి వెళ్తున్న కొందరు గమనించి పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించారు. వారొచ్చి ఆ వ్యక్తిని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చేబ్రోలు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వీరి వివరాలు తెలిస్తే 86888 31384 కు ఫోను చేయాలని తెలిపారు. వీరిద్దరు నారాకోడూరు లేక పరిసర గ్రామాలకు చెందిన దంపతులు కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఐటీ రిటర్నుల్లో బోగస్ క్లెయిములు తగవు

ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిళ్ల



సదస్సులో మాట్లాడుతున్న సునీత బిళ్ల

తెనాలి: ఆదాయపన్ను శాఖలో ఆన్‌లైన్‌లో రిటర్నులు అందుబాటులోకి వచ్చాక చెల్లింపుదారులు చక్కగా వినియోగించుకుంటున్నారని, వసూళ్లు పెరగటమే ఇందుకు నిదర్శనమని ఆదాయ పన్ను ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిళ్ల అన్నారు. ఆదాయానికి అనుగుణమైన పన్ను చెల్లింపులు సక్రమంగా ఉండాలని చెబుతూ, బోగస్ క్లెయిములుంటే తప్పనిసరిగా నోటీసులు వస్తాయని హెచ్చరించారు. ది తెనాలి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలోని కళ్యాణమండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. చాంబర్ ఉపాధ్యక్షుడు వుప్పల వరదరాజులు అధ్యక్షత వహించారు. ప్రిన్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ఆదాయ పన్ను శాఖ ఇప్పుడు సర్వీస్ ప్రొవైడర్‌గానూ పన్ను చెల్లింపుదారులకు అందుబాటులో ఉందని గురు చేశారు. ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. పన్ను మినహాయింపులు లేకున్నా, బోగస్ క్లెయిములు చేయొద్దని సూచించారు. రూ.30 లక్షలకు పైగా ఆస్తి కొనుగోలు చేసినప్పుడు, బ్యాంకులో పరిమితికి మించి డిపాజిట్ల లావాదేవీలపై తమ శాఖ నిఘా ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు తమ శాఖకు సమాచారం ఉంటుందని స్పష్టంగా చెప్పారు. అలాంటి సందర్భాల్లో పన్ను చెల్లింపుదారులు ఆడిటర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పన్ను రిటర్నుల విషయంలో ఆడిటర్లు, టాక్స్ ప్రాక్టీషనర్లపై గురుతర బాధ్యత ఉందన్నారు. పన్ను చెల్లింపుదారులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆదాయ పన్ను గుంటూరు రేంజ్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఓఎస్ సుప్రియారావు కూడా మాట్లాడారు. పన్ను చెల్లింపు రిటర్నులపై కొత్తగా వచ్చిన మార్గదర్శకాలపై తెనాలి ఆదాయ పన్ను అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్ వివరించారు. తొలుత చాంబర్ ఆఫ్ కామర్స్ తెనాలి కార్యదర్శి రావూరి సుబ్బారావు స్వాగతం పలికారు. మరో కార్యదర్శి గుండా రామకోటేశ్వరరావు, మాలేపాటి వేణు, మాలేపాటి తిరుమల, భాస్కరుని శ్రీనివాసరావు, కనపర్తి సూర్యనారాయణ, వ్యాపార ప్రముఖులు కొత్త సుబ్రహ్మణ్యం, కొత్తమాసు కుమార్, తోటకూర వెంకట రమణారావు, ఐఎంఏ తెనాలి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పావనీ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా కార్యదర్శి ఇ.శివ శంకర్ శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక ఎన్జీఓ క్లబ్‌లో ఉంటాయన్నారు. ఎంపిక చేసిన జట్లను విశాఖపట్నం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. వివరాలకు 93969 90666 ఫోను నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఖరీఫ్.. ఉఫ్..!

▶ఏడో పేజీ తరువాయి

అన్నదాతలకు చివరకు అన్నివిధాలా కన్నీరే మిగిలింది.

దెబ్బతీసిన వర్షాలు

గుంటూరు జిల్లాలో ఖరీఫ్ సాగు లక్ష్యం 1,25,914 హెక్టార్లు. ఇప్పటి వరకు 85,278 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటే 67.7 శాతం మేరకే అన్నదాతలు సాగు చేశారు. జూన్ నెల ఆరంభంలోనే వర్షాలు బాగా కురవడంతో చాలామంది వరి, మినుము, పత్తి, పెసర, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు సాగు చేశారు. కొన్ని రోజులు పంటలు పచ్చగా ఉన్నాయి. తర్వాత జూలై మాసంతో కురిసిన భారీ వర్షాలకు సుమారు 12 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కూటమి ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం చెల్లించలేదు. కేవలం సబ్సిడీ విత్తనాలతోనే సరిపెట్టడంతో రైతులు మళ్లీ సాగు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆగస్టు చివరిలో కురిసిన భారీ వర్షాలకు వారు పెట్టుకున్న ఆ కాస్త ఆశలు కూడా ఊడ్చుకుపోయాయి. మరోసారి పంటలు భారీగా నష్టపోయారు. దీంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

విస్తీర్ణం తగ్గిన వరి, మిరప

కృష్ణా పశ్చిమ డెల్టాకు నీరు వచ్చినా ఈ ఏడాది ఖరీఫ్‌లో వంద శాతం వరి పంట సాగయ్యేలా కనిపించడం లేదు. నీరు వచ్చి 80 రోజులు దాటినా సాగు ఇంకా ఊపందుకోలేదు. జూలై మాసంలో కురిసిన భారీ వర్షాలకు సుమారు 11 వేల హెక్టార్లలో వెద పద్ధతిలో సాగు చేసిన వరి పంట నీట మునిగింది. తిరిగి నాట్లు వేసుకునేందుకు చేతిలో డబ్బులు లేక చాలా వరకు రైతులు సాగు చేయలేకపోయారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వరి సాధారణ విస్తీర్ణం 63,733 హెక్టార్లు కాగా.. ఇప్పటి వరకు 55,346 హెక్టార్లలో మాత్రమే సాగైంది. మిరప సాధారణ విస్తీర్ణం 20,625 హెక్టార్లు ఉండగా.. 2,653 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ముగింపునకు 11 రోజులు మాత్రమే ఉంది. ఈలోపు ఎంత శాతం మేర వరి, మిరప పంటలు సాగు వేస్తారనేది చూడాలి. కేవలం కంది, సోయాబీన్ పంటలు మాత్రమే వంద శాతం మించి సాగయ్యాయి.

లక్ష్యసాధనకు కృషి

ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నాం. వాతావరణం అనుకున్న మేర అనుకూలించడం లేదు. దీంతోపాటు జూలై, ఆగస్టు మాసాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల సాగు విస్తీర్ణం పెంపులో కొంత వెనకపడాల్సి వచ్చింది. లక్ష్యం సాధించేందు అన్ని చర్యలు తీసుకుంటాం.

– నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించిన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)

నెల	సాధారణ వర్షపాతం	కురిసింది	అదనపు శాతం
జూన్	97.1	160	65
జూలై	164.9	214.2	30
ఆగస్టు	164.7	193.3	17
సెప్టెంబర్	87.1	228.2	162

జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

రకం	సాధారణం	ప్రస్తుతం సాగు	శాతం
వరి	63,733	55,346	86.8
పత్తి	26,982	20,068	74.4
మిరప	20,625	2,653	12.9
మినుము	2,417	1,242	51.4
పసుపు	1,671	1,128	67.5
సోయాబీన్	265	303	114.3
మొక్కజొన్న	137	34	24.8
కంది	105	110	104.8
పెసర	86	26	30.2
చెరకు	77	26	33.8
ఉల్లి	74	--	--
నువ్వులు	50	14	28
వేరుశనగ	45	20	44.4
టమాటా	20	4	20
జొన్న	6	--	--
జూట్	--	203	203
కూరగాయలు	2,198	811	36.9
ఇతర పంటలు	7,402	3,290	44.4

వెంటనే జీవో నెం. 85 రద్దు చేయాలి

గుంటూరు మెడికల్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు పీజీ చదువుకోవాలనే కోరికను హరించి వేస్తున్న జీవో నెం. 85ను ప్రభుత్వం రద్దు చేయాలని పలువురు ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేశారు. గ్రామీణ రోగులకు స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు విఘాతం కలిగించేలా ఈ జీవో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట వైద్యులు నినాదాలు చేశారు. ప్రభుత్వం జీవోను మార్చే వరకు తాము విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. ఇన్‌సర్వీస్ కోటాలో వైద్యులు పీజీ చదువుకునేందుకు గతంలో నాన్‌క్లినికల్ పీజీకి 50 శాతం, క్లినికల్ పీజీకి 30 శాతం పరిమితి ఉండేది. ప్రభుత్వం ఇటీవల కాలంలో ఈ కోటాలను 30, 10 శాతానికి కుదిస్తూ జీవో నెం.85 విడుదల చేసింది. ఈ జీవోను మార్పు చేయాలంటూ పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యులు ఈ నెల 16వ తేదీ నుంచి విధులు బహిష్కరించి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 64 మంది పీహెచ్‌సీ వైద్యులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అందులో భాగంగా శుక్రవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సంహారి యునికా మెర్సి, ఫరీనా బేగం, దిలీప్, రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, అనూష, సుచిత తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఆచార్యులకు ప్రతిష్టాత్మక గుర్తింపు



ఆచార్యులను అభినందిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య తదితరులు

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఆరుగురు ఆచార్యులు వరల్డ్ టాప్ సైంటిస్ట్‌ల జాబితాలో చోటు సాధించారని వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో తమ వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ అంబటి రంగారావు, కె.చంద్రశేఖర్, ప్రొఫెసర్ కె.వెంకటరావు, డాక్టర్ రుద్రపాల్ మిథున్, డాక్టర్ జోత్స్నాదేవి బోడపాటి, ప్రొఫెసర్ టి.సుబ్బయ్యలు వరల్డ్ టాప్ 2% సైంటిస్ట్‌లలో నిలిచారని తెలిపారు. గత సంవత్సరం వరకు ఉత్తమ సైంటిస్ట్‌ల డేటాను తీసుకోవడంతో పాటు స్టాండర్డ్ సైన్స్ మేట్రిక్స్ క్లాసిఫికేషన్‌లో గల 44 సైంటిఫిక్ ఫీల్డ్స్, 174 సబ్ ఫీల్డ్స్‌ను పరిగణనలోనికి తీసుకుని ఈ ఫలితాలను వెల్లడించారని పేర్కొన్నారు. వీరికి చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తదితరులు నగదు బహుమతులు అందించి, అభినందనలు తెలిపారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రాజు

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం నగరంలోని ఎంపీడీఓ ప్రాంగణంలోని కృషిభవన్‌లో నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీకాంత్ రాజు మాట్లాడుతూ.. సంఘాన్ని దుష్టశక్తులు, స్వార్థపరుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా నూతన అధ్యక్షుడుగా పవన్‌కుమార్, కార్యదర్శిగా అమ్మయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలకు దూరంగా ఉంటూ ఉద్యోగుల సమస్యలపై రాజీలేని ధోరణితో పోరాటానికి సిద్ధమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి.అస్కార్‌రావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ మహబూబ్‌బాషా, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రత్నకుమార్ పాల్గొన్నారు.

రేపు కత్తి పద్మారావుకు పురస్కారం ప్రదానం



మాట్లాడుతున్న డాక్టర్ అబ్రహాం లింకన్

తెనాలి అర్బన్: ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకులు డాక్టర్ కత్తి పద్మారావుకు ఖమ్మానికి చెందిన జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో 'మన కాలపు జాషువా' పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ శుక్రవారం సాయంత్రం తెనాలిలోని సేవా ట్రస్ట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. ఈ నెల 22వ తేదీన పొన్నూరులోని లుంబినీవనంలో కార్యక్రమం ఉంటుందన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు, దళిత మహాసభ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. విలేకరుల సమావేశంలో అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కార్యదర్శి దోబా సందీప్, ట్రెజరర్ పాముల దాసు, కనపర్తి ఎజ్రా, కొండ్రు రవీంద్ర, కనపర్తి చిట్టిబాబు, బ్రూస్లీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్యారమ్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపిక



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు గ్వాలియర్‌లో జరగనున్న 49వ జాతీయ జూనియర్ నేషనల్స్ పోటీలకు జిల్లాకు చెందిన బి.నవ్య, జి.మయూఖలు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రా స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నవ్య బంగారు, మయూఖ రజత పతకాలు సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశామని చెప్పారు. క్రీడాకారులకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నీరజ్ కుమార్ స్కాంపతి, చీఫ్ ప్యాట్రన్ యాగంటి దుర్గారావులు అభినందనలు తెలిపారన్నారు.

కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల ఆందోళన



నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు శుక్రవారం మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో ఆందోళన కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని వాపోయారు. న్యాయం చేయాలని విధులు బహిష్కరించి 16వ రోజూ నల్లబ్యాడ్జీలతో ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. తమను రెగ్యులర్ చేసే వరకు కార్యక్రమం కొనసాగుతుందని వారు తెలిపారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల తాము తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, స్వచ్ఛంద ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్య, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

శుభ్రతా కార్యక్రమాల్లో పొగాకు బోర్డు ప్రతినిధులు



కొరిటెపాడు: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగబోయే ఈ కార్యక్రమంలో భాగంగా రైతు భవన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. నోడల్ ఆఫీసర్ జి. దామోదర్, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్క నాటుతున్న సుచిత్ర, విజయలక్ష్మి

గుంటూరు మెడికల్ : అందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ సుచిత్ర అన్నారు. శుక్రవారం గుంటూరు ప్రాంతీయ శిక్షణ కేంద్రం, ఆర్డీ కార్యాలయాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ సుచిత్ర మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఊర్మిళ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మశ్రీ , ఆర్డీ కార్యాలయం సూపరింటెండెంట్‌లు షేక్ నాగూర్ షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే సబ్ డివిజన్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే సబ్ డివిజన్ డీఎస్పీగా పి.అక్కేశ్వరరావు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆయన నెల్లూరు, ఒంగోలు, గుంటూరులలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. పదోన్నతిపై డీఎస్పీగా ఇక్కడ పోస్టింగ్ పొందారు. ఈ సందర్భంగా గుంటూరు ఆర్‌పీఎస్, జీఆర్‌పీ ఎస్‌హెచ్ఓ అంజిబాబు, ఎస్సై రమేష్, సుబ్బారావు, నడికుడి ఎస్సై శ్రీనివాసరావు నాయక్, గుంటూరు ఆర్‌పీఎఫ్ స్టాఫ్ తదితరులు ఆయనకు అభినందలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైల్వే ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని, వాటిని పరిష్కరిస్తానని తెలిపారు.

మందు బాబుల ఆరోగ్యంతో చెలగాటం

ప్రత్తిపాడు: తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అంటూ బీరాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం.. నాణ్యత సంగతి అటుంచితే... కాలం చెల్లిన బీర్లు మద్యం ప్రియులకు అంటగడుతోంది. అందుకు సాక్ష్యమే ఈ ఘటన. ప్రత్తిపాడులోని ఒక ప్రభుత్వ మద్యం దుకాణంలో గురువారం రాత్రి కొందరు యువకులు బూమ్ బూమ్ బీర్లు ఒక్కొక్కటి రూ. 180 చొప్పున కొనుగోలు చేశారు. తాగడానికి సీల్ ఓపెన్ చేశారు. ఇంతలో బీర్ బాటిల్‌పై ఉన్న తేదీలు ఎక్స్‌పైర్ అయ్యి ఉండటం చూసి అవాక్కయ్యారు. దుకాణం వద్దకు వెళ్లి కాలం చెల్లిన బీర్లు ఎలా విక్రయిస్తారంటూ ప్రశ్నించారు. తాజాగా వచ్చిన స్టాక్‌లోనే ఈ బీర్లు ఉండటం చూసి సిబ్బంది కూడా షాక్‌కు గురయ్యారు. దీంతో ఆ బీర్ సీసాల కేస్‌ను పక్కన పెట్టేశారు. దీనిపై ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్ఐ మాధవిని ప్రశ్నించగా.. సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశామని చెప్పారు.

పెదవడ్లపూడిలో నకిలీ క్లినిక్ మూసివేత

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో నకిలీ వైద్యుడు నిర్వహిస్తున్న విజయ క్లినిక్‌ని అధికారులు శుక్రవారం మూసేశారు. వాస్తవానికి డాక్టర్ విజయ మోహన్ పేరుతో దీన్ని ఏర్పాటు చేశారు. కానీ కుమార్ బాబు తగిన అర్హతలు లేకుండానే ఇక్కడ వైద్యం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు డీఎంహెచ్‌వో విజయలక్ష్మి ఆదేశాలతో స్థానిక మెడికల్ ఆఫీసర్ సతీష్ విచారణ చేపట్టారు. క్లినిక్‌ను మూసేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. ఇక్కడ డాక్టర్ విజయ మోహన్ వైద్యం అందించడం లేదని తెలిపారు. కుమార్ బాబు వైద్యం చేస్తుండడంతో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు క్లినిక్‌ను మూసివేసినట్లు చెప్పారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ విచారణ అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.